క్లుప్తంగా

వీరేశ్వర అన్నదాన ట్రస్టుకు విరాళం



దాతను సత్కరిస్తున్న ఆలయ సిబ్బంది

ఐ.పోలవరం: మురమళ్ల వీరేశ్వర అన్నదాన ట్రస్టుకు బుధవారం ఒక భక్తుడు భారీ విరాళం అందించారు. మురమళ్లకు చెందిన గ్రంధి సత్యసూర్యసుబ్రహ్మణ్య సురేష్, రాధాలక్ష్మీకృష్ణ కుమారి దంపతులు రూ.51,116 అన్నదాన ట్రస్టుకు అందించారు. ఈ సందర్భంగా దాతలకు స్వామి చిత్రపటం, శేష వస్త్రం, ప్రసాదం అందించి సత్కరించారు. ఆలయ అర్చకులు ఆధ్వర్యంలో దాతకు ప్రత్యేక దర్శనం కల్పించారు. దాతలను ఆలయ సహాయ కమిషనర్, కార్యనిర్వాహణాధికారి వి.సత్యనారాయణ దాతను అభినందించారు.

విద్యార్థుల్లో వెల్లివిరిసిన సేవాభావం



సేకరించిన సొమ్మును మృతుని తల్లికి అందజేస్తున్న ఎన్ఎస్ఎస్ ఆఫీసర్ సరెళ్ల వీరకుమార్

యానాం: ఇటీవల యానాం– కాకినాడ రహదారిలో పటవల వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతిచెందిన యువకుడు కుమార్‌రాజా కుటుంబానికి బుధవారం రీజెన్సీ జూనియర్ కళాశాల విద్యార్థులు సేకరించిన సొమ్మును సాయంగా అందజేశారు. విద్యార్థులు రూ.10,150 సేకరించి ఆ మొత్తాన్ని కురసాంపేటలోని కుమార్‌రాజా స్వగృహానికి వెళ్లి కుటుంబ సభ్యులకు అందించారు. గుప్పెడు బియ్యం–గుప్పెడు సాయం కార్యక్రమం ద్వారా సేకరిస్తున్న 70 కేజీల బియ్యాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ మార్తాండ ప్రసాద్, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ సర్లళ్ల వీరకుమార్, విద్యార్థులు పాల్గొన్నారు.

వీరేశ్వరుని ఆలయ పునర్నిర్మాణం పరిశీలన



మురమళ్ల నిర్మాణ పనులను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే దాట్ల సుబ్బరాజు

ఐ.పోలవరం: మురమళ్ల భద్రకాళి సమేత వీరేశ్వర స్వామి ఆలయాన్ని రాతితో పునర్మించనున్నారు. ఇందుకు రూ.4 కోట్ల సీజేఎఫ్ నిధులు మంజూరయ్యాయి. ఆలయ నిర్మాణం పనులను ముమ్మిడివరం ఎమ్మెల్యే ప్రభుత్వ విప్ దాట్ల సుబ్బరాజు దేవదాయ ధర్మాదాయ, ఇతర శాఖలకు చెందిన అధికారులతో కలసి బుధవారం పరిశీలించారు. ప్రస్తుతం ఉన్న ఆలయం లోతట్టు ప్రాంతంలో ఉండటంతో వర్షాలకు ముంపునకు గురవుతోందని, దీంతో ఆలయ పునర్నిర్మాణం చేపట్టేందుకు కార్యాచరణ సిద్ధం చేస్తున్నట్లు ఎమ్మెల్యే తెలిపారు. ఆలయ అసిస్టెంట్ కమిషనర్, కార్యనిర్వాహణాధికారి వి.సత్యనారాయణ, డీఈఈ ఉదయ్ కుమార్, మాజీ చైర్మన్లు, మాజీ ధర్మకర్తలు, గ్రామస్తులు పాల్గొన్నారు.

వ్యక్తి అదృశ్యంపై కేసు నమోదు



గణపతి

తాళ్లరేవు: కోరంగి పంచాయతీ సీతారామపురానికి చెందిన కడలి గణపతి అదృశ్యమైనట్లు కోరంగి హెడ్ కానిస్టేబుల్ ఎస్వీ రమణ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల మేరకు గణపతికి ఎనిమిదేళ్ల క్రితం కొమరగిరికి చెందిన కడలి శ్రావణితో వివాహమైంది. వీరికి కుమార్తె, కుమారుడు ఉన్నారు. గతంలో గణపతి లారీ డ్రైవర్‌గా పనిచేసేవాడు. రెండేళ్లుగా అతని మానసిక పరిస్థితి బాగాలేని కారణంగా వైజాగ్‌లోని ప్రభుత్వ మెంటల్ కేర్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. ఈ నెల 6న భార్యాభర్తలిద్దరూ కొమరగిరి అత్తవారింటికి వెళ్లి, 7వ తేదీన గణపతి సీతారామపురం తిరిగి వచ్చారు. 8వ తేదీ ఉదయం 5 గంటలకు గణపతి బయటకు వెళ్లి తిరిగి రాలేదని శ్రావణి కోరంగి పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. హెడ్ కానిస్టేబుల్ ఎస్వీ రమణ మిస్సింగ్ కేసుగా నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు. అతని వివరాలు తెలిసినవారు 9440796521 నంబర్‌కు లేదా కోరంగి పోలీస్‌స్టేషన్‌కు సమాచారం ఇవ్వాలని కోరారు.



ముంపు నీటిలో మురమళ్లలోని వీరేశ్వరస్వామి ఆలయానికి వెళ్లే రహదారి



తహసీల్దార్ కార్యాలయంలోకి చేరిన వర్షపునీరు



అమలాపురం బస్టాండ్ వద్ద వర్షం నీరు



గొల్లవిల్లిలో వర్షానికి తడుచుకుంటూ ఇంటికి వెళ్తున్న విద్యార్థులు

దంచి కొట్టిన వాన

- 3 గంటల పాటు కుండపోత వర్షం
- పలు రోడ్లు జలమయం
- ప్రయాణికులకు ఇబ్బందులు

అమలాపురం టౌన్: బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడన ద్రోణి ప్రభావంతో ఆకాశానికి చిల్లు పడిందా అనే రీతిలో కోనసీమ వ్యాప్తంగా భారీ వర్షం కురిసింది. బుధవారం సాయంత్రం 3 గంటల నుంచి 6 గంటల వరకూ కురిసిన కుండపోత వర్షం వల్ల పట్టణంలో దాదాపు జన జీవనం స్తంభించింది. పలు కాలనీల్లో ఇళ్ల ముందుకు ముంపునీరు రావడంతో స్థానికులు ఇబ్బందులు పడ్డారు. వర్షం కారణంగా దుకాణాలు, చిరు వ్యాపారులు తోపుడు బండ్ల మీద అమ్మకాలు నిలిచిపోయాయి. ఆటోల రాకపోకలు నిలిచిపోవడంతో ప్రయాణికులు ఎక్కడివారు అక్కడే ఉండిపోయారు. డ్రెయిన్లు పొంగి పొర్లడంతో రోడ్ల మీద రెండు అడుగుల ఎత్తున నీరు నిలిచింది. రోడ్డుపై నీరు నిలువ ఉండటంతో ట్రాఫిక్ అంతరాయం ఏర్పడింది. బుధవారం పెళ్లిళ్ల ముహూర్తాలు ఎక్కువగా ఉండడంతో జిల్లాలోని పలు చోట్ల పలువురి ఇంట వివాహాది శుభ కార్యాలకు భారీ ఏర్పాట్లు చేసుకున్నారు. దంచి



జలమయమైన అమలాపురం దొమ్మేటి వారి వీధి

కొట్టిన వర్షంతో వారంతా తీవ్ర అసౌకర్యానికి గురయ్యారు. భారీ వర్షం వల్ల పట్టణంలోని పలు వీధులు, రోడ్లు జలమయ్యాయి. ఎన్టీఆర్ మార్గ్ సీసీ రోడ్డులో పలు చోట్ల జలమయమైంది. ఆర్టీసీ బస్ స్టేషన్ నుంచి ఈదరపల్లి వంతెన వరకూ ముంపు నీరు రోడ్డుపై నిలిచిపోయింది. కాలేజీ రోడ్డు, హైస్కూలు రోడ్డు, దొమ్మేటివారి వీధి, అశోక్ నగర్, కుంకాల సందు, కాపు కళ్యాణ మండపం రోడ్డు ఇలా పలు రోడ్లు, వీధులు ముంపుబారిన పడ్డాయి. వర్షం వెలిసిన కొన్ని గంటల తర్వాత ముంపు నీరు క్రమేపీ తగ్గుముఖం పట్టింది. సాయంత్రం 4.30 నుంచి 5 గంటల మధ్య పట్టణంలోని వివిధ కళాశాలలు, పాఠశాలలు వదలడంతో స్కూలు బస్సులు, విద్యార్థులను ఇళ్లకే చేర్చే ఆటోలకు అవస్థలు అనివార్యమయ్యాయి. పట్టణమంతా పలు రోడ్లు, వీధులు జలమయం కావడంతో వాహన చోదకులు ఆ ముంపు నీటిలోనే అతికష్టంగా వెళ్లారు. పట్టణంలోని మార్కెట్ కుండపోత వర్షంతో స్తంభించింది. మూడు గంటల పాటు బేరాలు లేక వ్యాపారులు దుకాణాల్లోనే కాలక్షేపం చేశారు. ప్రజలు 80 శాతం మంది భారీ వర్షంతో ఇళ్లకే పరిమితమయ్యారు. పట్టణంలోని శ్రీదేవి మార్కెట్, ముస్లిం వీధిలోని కొన్ని దుకాణాల్లోకి సైతం వర్షం ముంపు నీరు వెళ్లడంతో వ్యాపారస్తులు ఆందోళనకు గురయ్యారు. ముఖ్యంగా ద్విచక్ర వాహన చోదకులు వర్షంతో తలదాచుకునేందుకు పలు షాపులను, షెడ్లను ఆశ్రయించారు. మధ్యాహ్నం కురిసిన ఎడతెరపి లేని వర్షం కారణంగా లోతట్టు ప్రాంతాల్లోని వరిచేలల్లో ముంపు నీరు చేరింది. ఉద్యాన పంటలైన కొబ్బరి, అరటి రైతులకు మాత్రం వర్షం ఊరటనిచ్చింది.

ముంచెత్తిన భారీ వర్షం

ఐ.పోలవరం: మండలంలో భారీ వర్షం కారణంగా మురమళ్ల, ఐ.పోలవరం, కేశనకుర్రు, తిల్లకుప్ప, ఎదుర్లంక, గుత్తినదీవిలో ప్రధాన రహదారులు, లోతట్టు ప్రాంతాల్లో ముంపు నీరు చేరింది. మురమళ్ల వీరేశ్వర స్వామి ఆలయానికి వెళ్లే రోడ్డు మీద ముంపునీరు చేరడంతో భక్తులు ఇబ్బంది పడ్డారు.

రోడ్లు జలమయం

కాట్రేనికోన: భారీ వర్షానికి కాట్రేనికోన గేటు సెంటరు, ఆటో స్టాండ్, మార్కెట్ ప్రాంతం, కందికుప్ప సెంటరు పల్లంకుర్రుతో పాటు లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. ఈదురుగాలులకు మండలంలో మధ్యాహ్నం 2 నుంచి రాత్రి 7 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. కందికుప్ప జెడ్పీహెచ్ పాఠశాల, జమ్మిచెరువు కాలనీలలో వర్షపు నీరు నిలబడింది. అల్ప పీడన ప్రభావంతో చేపల వేట చేసే మత్స్య కార్మికులు సముద్రంపై వేటకు వెళ్లకుండా ఇళ్లకు పరిమితమయ్యారు.

తడిసి ముద్దయిన విద్యార్థులు

ఉప్పలగుప్తం: గొల్లవిల్లి జెడ్పీ ఉన్నత పాఠశాలలో చదువుతున్న విద్యార్థులు బుధవారం కురిసిన ఎడతెరిపిలేని వర్షానికి తడిసి ముద్దయ్యారు. పాఠశాల వదిలే సమయానికి భారీ వర్షం కురవడంతో విద్యార్థులు పాఠ్యపుస్తకాలతో తడుస్తూ ఇళ్లకు వెళ్లారు.

భారీవర్షాలకు పలు వీధుల మునక

యానాం: నియోజకవర్గ పరిధిలో బుధవారం ఉదయం నుంచి కురుస్తున్న భారీ వర్షాలకు పలులోతట్టు ప్రాంతాల్లో వీధులు ముంపునకు గురడంతో ఆ ప్రాంత నివాసితులు తీవ్ర ఇబ్బందులను ఎదుర్కొంటున్నారు. ముఖ్యంగా గోపాల్‌నగర్, ద్రాక్షారామ–యానాం రహదారి, బైపాస్ సెంటర్ తదితర ప్రాంతాలు ముంపునకు గురయ్యాయి. ముఖ్యంగా పలు డ్రెయిన్లు నిర్వహణ లేకపోవడంతో పూడుకుపోయి మురుగునీరు శివారుకు ప్రవహించడం లేదు. దీంతో రహదారులు ముంపుకు గురవుతున్నాయని పలువురు ఆవేదన వ్యక్తం చేశారు.



వర్షం నీటిలో చిక్కుకున్న మోటార్ సైకిళ్లు



ముమ్మిడివరంలో రహదారికి అడ్డంగా కూలిన భారీ వృక్షం



ముంపుబారిన ముమ్మిడివరం జీఎంసీ బాలయోగి కాలనీ

ముమ్మిడివరంలో కుండపోత వర్షం

ముమ్మిడివరం: భారీ వర్షానికి ముమ్మిడివరం తహసీల్దార్ కార్యాలయం, సబ్ ట్రెజరీ కార్యాలయంలోకి ముంపునీరు చొచ్చుకుపోయింది. తహసీల్దార్ కార్యాలయం రికార్డురూంలోకి నీరు చేరడంతో రికార్డులను భద్రపర్చుకునే పనిలో ఉద్యోగులు నిమగ్నమయ్యారు. సబ్‌ట్రెజరీ కార్యాలయంలో బీరువాలు, టేబుళ్ల నీట మునిగాయి. ఈ కార్యాలయాలున్న భవనం 1915లో నిర్మించడంతో ప్రస్తుతం పల్లపు ప్రాంతంలో ఉండటం వల్ల ముంపు నీరు చేరింది. ముమ్మిడివరం గ్రామకచేరి భవనం ముంపుబారిన పడటంతో అధికారుల విధుల నిర్వహణకు ఆటంకం ఏర్పడింది. ముమ్మిడివరం బాలుర ఉన్నత పాఠశాల ఆవరణ, పోలీస్‌స్టేషన్ ఆవరణ, మంద బయలు కాలనీ, హస్పిటల్ రహదారులు, జీఎంసీ బాలయోగి కాలనీ జలమయమయ్యాయి. సుమారు 300 కుటుంబాలున్న జీఎంసీ బాలయోగి కాలనీలో డ్రెయినేజి సౌకర్యం లేకపోవడంతో వర్షపునీరు ఇళ్లను ముంచెత్తడంతో పలు కుటుంబాలవారు ఇబ్బందికి గురయ్యారు. రానేల్లంక వీవర్స్ కాలనీ, కర్రివాని రేవు కొత్తకాలనీ కొమాన పల్లి అంబేడ్కర్ నగర్‌తోపాటు పలు లోతట్టు ప్రాంతాలు ముంపుబారిన పడ్డాయి. ముమ్మిడివరం తహసీల్దార్ కార్యాలయం ఎదుట రహదారిపై భారీ వృక్షం కూలిపోవడంతో ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయం ఏర్పడింది.

ఇన్‌స్పైర్ నామినేషన్లలో జిల్లాను అగ్రస్థానంలో నిలపండి



ఇన్‌స్పైర్ నామినేషన్లపై అవగాహన పోస్టర్ ఆవిష్కరిస్తున్న కలెక్టర్ మహేష్‌కుమార్

అమలాపురం రూరల్: అంబేడ్కర్ కోనసీమ జిల్లా విద్యార్థులు ఇన్‌స్పైర్ మనాక్ నామినేషన్లు సమర్పించడంలో చురుగ్గా పాల్గొని జిల్లాను రాష్ట్రంలో అగ్రస్థానంలో నిలపాలని కలెక్టర్ రావిరాల మహేష్‌కుమార్ పిలుపునిచ్చారు. కలెక్టరేట్ ప్రాంగణంలో కలెక్టర్ ఇన్‌స్పైర్ నామినేషన్లపై అవగాహన పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఇన్‌స్పైర్ మనాక్ భారత ప్రభుత్వ సైన్స్ అండ్ టెక్నాలజీ విభాగం ఆధ్వర్యంలో 6 నుంచి 10వ తరగతి వరకు చదువుతున్న విద్యార్థుల్లో విజ్ఞాన ఉత్సాహం, సృజనాత్మకత, ఆవిష్కరణాత్మక ఆలోచనలను పెంపొందించేందుకు రూపొందించిన జాతీయస్థాయి కార్యక్రమని వివరించారు.

జిల్లాలోని ప్రభుత్వ, ప్రైవేట్ ఆధ్వర్యంలోని అన్ని పాఠశాలల నుంచి విద్యార్థులు తప్పనిసరిగా సెప్టెంబర్ 15లోపు నామినేషన్లు పంపాలని తెలిపారు. ఎంపికైన ఉత్తమ ఆవిష్కరణలకు రూ.10,000 నగదు బహుమతి లభిస్తుందని కలెక్టర్ పేర్కొన్నారు. 3వేల నామినేషన్లు సమర్పించడం ద్వారా కోనసీమ జిల్లా రాష్ట్రస్థాయిలో ప్రథమ స్థానంలో నిలవాలని ఆశాభావం వ్యక్తం చేశారు. వివరాల కోసం జిల్లా సైన్స్ అధికారి జీవీఎస్ సుబ్రహ్మణ్యం సెల్ నంబర్‌ను 9640188525 సంప్రదించవచ్చని తెలిపారు. ఈ కార్యక్రమంలో సమగ్ర శిక్ష అదనపు ప్రాజెక్టు కోఆర్డినేటర్ జి. మమ్మి, జిల్లా మెడికల్ అండ్ హెల్త్ ఆఫీసర్ డాక్టర్ దుర్గారావు దొర, వివిధ సెక్టోరియల్ ఆఫీసర్లు, మండల ఎడ్యుకేషనల్ ఆఫీసర్లు, జిల్లా విద్యాశాఖ ప్రముఖులు పి. రామలక్ష్మణమూర్తి, గుబ్బల సూర్యప్రకాశం పాల్గొన్నారు.

పార్టీని బలోపేతం చేసేందుకు కృషి చేయాలి



ఇందుపల్లి గ్రామ కమిటీ అధ్యక్షుడు ప్రసాద్‌ను అభినందిస్తున్న డాక్టర్ శ్రీకాంత్

అమలాపురం రూరల్: గ్రామస్థాయి నుంచి వైఎస్సార్ సీపీని బలోపేతం చేసేందుకు కృషి చేయాలని అమలాపురం నియోజవర్గం కో–ఆర్డినేటర్ డాక్టర్ పినిపే శ్రీకాంత్ అన్నారు. రూరల్ మండలం ఇందుపల్లి వైఎస్సార్ సీపీ నూతన గ్రామ కమిటీ అధ్యక్షుడిగా కుడుపూడి ప్రసాద్ బుధవారం ఎన్నికయ్యారు. వైఎస్సార్ సీపీ కో–ఆర్డినేటర్ డాక్టర్ పినిపే శ్రీకాంత్ ఆధ్వర్యంలో నూతన గ్రామ కమిటీని ఎన్నుకున్నారు. రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చెల్లుబోయిన శ్రీనివాసరావు, ఎంపీపీ కుడుపూడి భాగ్యలక్ష్మి, జెడ్పీటీసీ పందిరి హరిరామ్ గోపాల్, అమలాపురంరూరల్ మండల వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు గుత్తుల చిరంజీవి, మండల యువజన విభాగ అధ్యక్షుడు కేత భానుతేజప్రసాద్‌ను అభినందించారు. ఈ కార్యక్రమంలో దొమ్మేటి రాంబాబు, చొల్లంగి శ్రీను, రామాంజనేయులు, కముజు సురేష్,దొమ్మేటి రమణ, వెంకటేశ్వరరావు కొవ్వూరు బాబి, దొమ్మేటి సుధాకర్, దొమ్మేటి శేఖర్, దుర్గారావు చొల్లంగి శ్రీనివాస్, కుడుపూడి నాని పాల్గొన్నారు.

వెంకన్న ఆలయానికి రూ.3 కోట్లు మంజూరు



మాట్లాడుతున్న మల్లాడి

యానాం: శ్రీభూసమేత వేంకటేశ్వరస్వామి నూతన ఆలయం రెండవ ఫేజ్ నిర్మాణానికి పుదుచ్చేరి ప్రభుత్వం ఇప్పటికే ఇచ్చిన రూ.2కోట్లకు అదనంగా మరో రూ.కోటితో కలిపి మొత్తం రూ.3కోట్లు సహాయం అందిస్తోందని పుదుచ్చేరి ప్రభుత్వ ఢిల్లీ ప్రతినిధి మల్లాడి కృష్ణారావు తెలిపారు. బుధవారం రాత్రి ఆయన మాట్లాడుతూ యానాంలో వేంకటేశ్వరస్వామి ఆలయ నిర్మాణానికి సీఎం రంగసామి నిధుల మంజూరుకు ఆదేశాలిచ్చారన్నారు. దాతల సాయం రూ.4.50 కోట్లతో మిగిలిన పనులు పూర్తిచేస్తామన్నారు. 2026 కార్తీకమాసం నాటికి ఆలయ నిర్మాణం పూర్తిచేయాలని లక్ష్యంగా నిర్ణయించినట్లు తెలిపారు. పుష్కరాలకు ముందుగానే ఆలయం పూర్తిచేస్తే వివిధ ప్రాంతాల నుంచి తరలివచ్చే వేలాది మంది భక్తులకు తరలివస్తారని తెలిపారు. యానాం నుంచి హోంమంత్రి నమశ్శివాయం పోటీచేస్తారని వచ్చే ఊహాగానాలు వాస్తవం కాదని ఆయన స్పష్టం చేసారు. జిప్‌మెర్ ఆసుపత్రిలో వచ్చే సెప్టెంబర్ నుంచి అన్ని వైద్య సేవలు అందుబాటులోకి వస్తాయన్నారు. వెటర్నరీ ఆసుపత్రి ఆవరణలో ఎకరం స్థలంలో జిప్‌మెర్ వైద్యులకు, సిబ్బందికి క్వార్టర్లుగా నిర్మించాలని నిర్ణయించినట్లు తెలిపారు. గిరియాంపేటలో నూతనంగా నిర్మాణం చేసిన ఇంజినీరింగ్ కళాశాల భవనాన్ని జిప్‌మెర్ ఆసుపత్రికి వచ్చే క్యాన్సర్ రోగులకు వైద్యాన్ని అందించాలని ప్రతిపాదించి కేంద్ర ప్రభుత్వానికి పంపినట్లు తెలిపారు.

నేషనల్ మజ్దూర్ యూనియన్ ఉద్యోగుల ధర్నా

అమలాపురం రూరల్: నేషనల్ మజ్దూర్ యూనియన్ రాష్ట్ర కమిటీ పిలుపుమేరకు ఆర్టీసీ ఉద్యోగుల సమస్యలపై అమలాపురం డిపోలో ఉద్యోగులు రెండోవ రోజు బుధవారం ధర్నా నిర్వహించారు. యునైటెడ్ వర్కర్స్ యూనియన్ జిల్లా ఉప కార్యదర్శి కె.రంగప్రసాద్ ఉద్యోగులకు సంఘీభావం తెలిపారు. ఎన్ఎంయూ సెక్రటరీ పి.మణిరాజు, ఎన్ఎంయూ డిపో అధ్యక్షుడు ఔలియా, ఉపాధ్యక్షుడు కేయస్ రావు, ఆర్గనైజింగ్ సెక్రటరీ కె.నాగరాజు పాల్గొన్నారు.



అమలాపురంలో ధర్నా చేస్తున్న ఆర్టీసీ ఉద్యోగులు

నీటి సరఫరాను పునరుద్ధరించాలి



పైపులైను ప్రాంతాన్ని పరిశీలించిన ఎమ్మెల్యే అశోక్, అధికారులు

యానాం: నియోజకవర్గ పరిధిలో జీఎస్ నాయుడు కాలనీ, రాజరాజేశ్వరీ నగర్, నవాజ్ గార్డెన్స్, కామరాజు నగర్ తదితర ప్రాంతాల్లో రెండు రోజులుగా తాగునీటి సరఫరా నిలిచిపోయిందని తక్షణం ఆయా ప్రాంతాలకు తాగునీటి సరఫరా చేయాలని ఎమ్మెల్యే గొల్లపల్లి శ్రీనివాస్‌అశోక్ అధికారులను ఆదేశించారు. బుధవారం ఇటీవలి మరమ్మతులు చేస్తున్న క్రమంలో పైపులైను పగలడంతో కొద్ది రోజులుగా తాగునీటి సరఫరా నిలిచిపోవడంతో ఆ ప్రాంతవాసులు ఫిర్యాదు మేరకు ఎమ్మెల్యే అశోక్ పరిశీలించారు. డ్రెయినేజీలో పూడిక తొలగించడంతో పాటు పైపులైనుకు మరమ్మతులు పూర్తి చేసి నీటి సరఫరాను పునరుద్ధరించాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో పీడబ్ల్యూడీ ఏఈ కాళ్ల నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

ప్రతిభాసేవా పతకానికి ఎస్సై నూకరాజు ఎంపిక



యానాం: పట్టణ ట్రాఫిక్ ఎస్సై శేరు నూకరాజు ప్రతిష్టాత్మకమైన రాజీవ్‌గాంధీ మెరిటోరియస్ పోలీస్ సర్వీస్ పతకానికి ఎంపికయ్యారు.ఈ మేరకు పుదుచ్చేరి పోలీస్‌శాఖ నుంచి సమాచారం అందిందని ఎస్సై నూకరాజు బుధవారం తెలిపారు. ఈనెల 15న పుదుచ్చేరిలో నిర్వహించే స్వాతంత్ర్య వేడుకల్లో ప్రతిభాసేవా పతకం ప్రదానం చేస్తారని తెలిపారు. పోలీసుశాఖలో 37 ఏళ్ల సర్వీసు కలిగిన నూకరాజు స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా పుదుచ్చేరిలో నిర్వహించే వేడుకల్లో ఆయన పతకాన్ని స్వీకరించనున్నారు. సీఐ అడలరసన్, ఎస్సై సుబ్బరాజు, పోలీసులు నూకరాజుకు అభినందనలు తెలిపారు.

తాళ్లరేవు త్రిసభ్య కమిటీ ప్రమాణ స్వీకారం

తాళ్లరేవు: సహకార పరపతి సంఘం త్రిసభ్య కమిటీ ప్రమాణ స్వీకార కార్యక్రమం బుధవారం తాళ్లరేవులో ఘనంగా నిర్వహించారు. సొసైటీ చైర్మన్‌గా విల్ల వీరవెంకటఆదినారాయణ(వీర), డైరెక్టర్లుగా సామా త్రిపుర సుందరి, నిమ్మకాయల దుర్గాభవానీ ప్రమాణ స్వీకారం చేశారు. సొసైటీ సీఈఓ ధూళిపూడి మోహన్ త్రిసభ్య కమిటీ సభ్యులతో ప్రమాణస్వీకారం చేయించారు.

తాళ్లమ్మకు గాజుల అలంకరణ

కొత్తపేట: స్థానిక కమ్మిరెడ్డిపాలెం గ్రామ దేవత తాళ్లమ్మ అమ్మవారిని బుధవారం గాజులతో అలంకరించారు. శ్రావణమాసం సందర్భంగా ఆలయ కమిటీ అధ్యక్షుడు మిద్దే సత్యనారాయణ, కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో ఆసాదు పిల్లి వెంకటనాగరాజు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం మొత్తం అమ్మవారి విగ్రహానికి గాజులు అలంకరించారు. కమ్మిరెడ్డిపాలెం పరిసర ప్రాంతాల భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారు.

చైతన్యవంతంగా డ్రగ్స్ వ్యతిరేక ర్యాలీ



అమలాపురంలో డ్రగ్స్ వ్యతిరేక ర్యాలీలో పాల్గొన్న డిప్యూటీ డీఎం అండ్ హెచ్‌వో , వైద్యులు

అమలాపురం టౌన్: స్థానిక ప్రభుత్వ ఏరియా ఆస్పత్రిలోని డి–అడిక్షన్ సెంటర్ ఆధ్వర్యంలో నశా ముక్త్ భారత్ అభియాన్ (ఎన్ఎంబీఏ) కార్యక్రమంలో భాగంగా డ్రగ్స్ వ్యతిరేక ర్యాలీ బుధవారం చైతన్యవంతంగా సాగింది. స్థానిక ప్రభుత్వ ఏరియా ఆస్పత్రి ప్రాంగణంలో ఈ ర్యాలీని జిల్లా డిప్యూటీ డీఎం అండ్ హెచ్‌వో డాక్టర్ సీహెచ్ భరతలక్ష్మి జెండా ఊపి ప్రారంభించారు. ప్రధానంగా నేటి యువత డ్రగ్స్ బారిన పడకుండా చేయాలని, అందుకు అనుక్షణం అప్రమత్తతతో కుటుంబీకులు, వైద్యులు ఉండాలని డాక్టర్ భరతలక్ష్మి సూచించారు. ఆస్పత్రి జనరల్ మెడిసన్ విభాగం డాక్టర్ కారెం రవి తేజ, డి– అడిక్షన్ సెంటర్ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ సాయిరామ్, ప్రాజెక్ట్ కో ఆర్డినేటర్ శ్రీనుబాబు, ఆస్పత్రి అభివృద్ధి కమిటీ ప్రతినిధి వలవల శివరావు ప్రసంగించి డ్రగ్స్ నిర్మూలనకు తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. ర్యాలీలో ఈగల్ సెల్ పోలీసులు, జన కళ్యాణ్ స్వచ్ఛంద సంస్థ ప్రతినిధులు, న్యూ లైఫ్ డి–అడిక్షన్ సెంటరు సిబ్బంది, వియాన్ ఎన్జీవో సిబ్బంది, మిరియం డిగ్రీ కళాశాల, పరంజ్యోతి ఐటీఐ కళాశాల, నర్సింగ్ కళాశాల విద్యార్థులు, ఏరియా ఆస్పత్రి పారా మెడికల్ సిబ్బంది పాల్గొని డ్రగ్స్ వ్యతిరేక ప్రతిజ్ఞ చేశారు.

యువత మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలి

తాళ్లరేవు: యువత మాదక ద్రవ్యాలు, మత్తు పదార్థాలకు దూరంగా ఉండి చదువుపై శ్రద్ధ చూపి ఉజ్వల భవిష్యత్తును అందుకోవాలని తాళ్లరేవు సీడీపీఓ, కాకినాడ జిల్లా మిషన్స్ కోఆర్డినేటర్ వి.మాధవి తెలిపారు. బుధవారం స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో నషా ముక్త్ భారత్ అభియాన్ ప్రతిజ్ఞ కార్యక్రమానికి ఆమె ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో ఎంఈఓ ఏ.మంగాయమ్మ, కళాశాల ప్రిన్సిపాల్ కెవి సత్యన్నారాయణ, డీసీపీయూ సోషల్ వర్కర్ చిన బాబు, జీఎంఎస్‌కే రమ, ఎన్‌జీఓ త్రిమూర్తులు, అంగన్‌వాడీ వర్కర్లు, అధ్యాపకులు, సిబ్బంది పాల్గొన్నారు.

మాదక ద్రవ్యాలతో ఆరోగ్యానికి అనర్థం

ముమ్మిడివరం: యువతరంలో మాదక ద్రవ్య వ్యసనం తీవ్రమైన ఆందోళనకరంగా మారుతోందని ఐసీడీఎస్ సీడీపీఓ ఎం.నిహారిక పేర్కొన్నారు. ముమ్మిడివరం మోకా గణపతిరావు ప్రభుత్వ జూనియర్ కళాశాలలో బుధవారం మాత శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో మదక ద్రవ్యాల వ్యసనంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సీడీపీఓ నిహారిక మాట్లాడుతూ మాదక ద్రవ్యాలు ఉపయోగించే వ్యక్తికే కాకుండా ఆ కుటుంబం, సమాజంపై తీవ్ర పరిణామాలకు దారి తీస్తోందన్నారు. ఈ కార్యక్రమంలో భాగంగా డ్రగ్స్ వినియోగానికి వ్యతిరేకంగా కళాశాల విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించారు. ప్రిన్సిపాల్ ప్రశాంతి,అధ్యాపకులు, ఐసీడీఎస్ కార్యాలయ పర్యవేక్షకులు పాల్గొన్నారు.

వ్యవసాయ రంగాన్ని ఆదుకోవాలి



కలెక్టరేట్ వద్ద నిరసన తెలుపుతున్న రైతు సంఘాలు, వ్యవసాయ కార్మిక సంఘ నేతలు

అమలాపురం రూరల్: అమెరికా అధ్యక్షుడు ట్రంప్, ప్రధాని మోదీ నేతృత్వంలో గతంలో చేసుకున్న వాణిజ్య ఒప్పందాలు వ్యవసాయ రంగాన్ని కుదేలు చేస్తున్నాయని, తక్షణం వాటిని రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ రైతు సంఘాలు, వ్యవసాయ కార్మిక సంఘం, ప్రజాసంఘాలు, వామపక్షాల ఆధ్వర్యంలో కలెక్టరేట్ వద్ద బుధవారం నిరసన తెలిపారు. అమెరికాతో వాణిజ్య ఒప్పందాలకు సంబంధించిన పత్రాల నకలు దహనం చేసారు. కేంద్ర ప్రభుత్వం వ్యవసాయ రంగాన్ని ఆదుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో రైతు సంఘాల సమితి కోనసీమ జిల్లా కన్వీనర్ కె.సత్తిబాబు, కో–కన్వీనర్ కారెం వెంకటేశ్వరరావు, వివిధ ప్రజా సంఘాల నాయకులు దేవరాజేంద్ర ప్రసాద్, జి. దుర్గాప్రసాద్, పీతల రామచంద్రరావు తదితరులు పాల్గొన్నారు.

ట్రంప్ సుంకాలకు నిరసనగా ధర్నా

తాళ్లరేవు: అమెరికా అధ్యక్షుడు ట్రంప్ భారతదేశ రైతాంగం, పరిశ్రమలపై యాభై శాతం పన్నులు విధించడం వల్ల ఆక్వారంగం కుదేలయ్యే పరిస్థితి నెలకొందని ఆక్వా రైతులను ఆదుకునేలా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చర్యలు చేపట్టాలని కోరుతూ బుధవారం ధర్నా నిర్వహించారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయం వద్ద కౌలు రైతు సంఘం, వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ ధర్నాలో కౌలు రైతు సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ఎం.రాజశేఖర్, వల్లు రాజబాబు, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు కేఎస్ శ్రీనివాస్, టి.ఈశ్వరరావు తదితరులు మాట్లాడారు. రైతాంగం, కార్మికులు ప్రభుత్వ విధానాలకు నిరసనగా ఉద్యమించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో పెండెం జాను, కొప్పాడి మహాలక్ష్మి, చిక్కం రామచంద్రుడు, పోశింశెట్టి సూర్యప్రకాశరావు, గండి అనిల్ పాల్గొన్నారు.

పర్యాటక అవార్డులకు దరఖాస్తుల ఆహ్వానం

అమలాపురం రూరల్: రాష్ట్ర పర్యాటక అథారిటీ, రాష్ట్ర వార్షిక పర్యాటక విశిష్ట అవార్డులు (2024–25) కోసం వివిధ విభాగాల్లోని వ్యక్తులు, సంస్థలు, సంబంధిత పర్యాటక విభాగాల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తోంది. ఎంపికైనవారిని రాష్ట్ర వార్షిక పర్యాటక విశిష్టత అవార్డులు 2024–25 కోసం నామినేట్ చేస్తారని అధికారులు తెలిపారు. దరఖాస్తు వివరాలు, మార్గదర్శకాలు రాష్ట్ర పర్యాటక శాఖ వెబ్‌సైట్ నుంచి డౌన్‌లోడ్ చేసుకోవచ్చన్నారు. దరఖాస్తులను పోస్టు, వ్యక్తిగతంగా లేదా అధీకృత ప్రతినిధుల ద్వారా వచ్చేనెల 1వతేదీ లోపు సమర్పించవచ్చన్నా రు. వివరాలకు బి.అన్వర్ హుస్సేన్, పర్యాటక సమాచార అధికారి అంబేడ్కర్ కోనసీమ జిల్లా సెల్ నంబర్లు 9121725757, కె.సురేశ్‌కుమార్, జూనియర్ అకౌంటెంట్ 7036530828 సంప్రదించాలన్నారు. ముఖ్య కార్యనిర్వహణ అధికారి, ఏపీ టూరిజం అథారిటీ,స్టాలిన్ కార్పొరేట్ బిల్డింగ్, ఆటోనగర్, విజయవాడ –520007 చిరునామకు ఎంట్రీలను పంపాలన్నారు.